# నైతిక విలువల కమిటీ
# (రూల్ 287 నుండి 295)

(i) సభ లోపల, సభ వెలుపల సభ్యుల అనైతిక ప్రవర్తనను పరిశీలించడానికి సభాపతి సభ ప్రారంభమైన సమయంలో మరియు సందర్భాను సారంగా ఆయా సమయాలలో నైతిక విలువల కమిటీని నామనిర్దేశం చేయును. 2 (ఎం) నియమం యొక్క అర్థ పరిధిలోకి వచ్చే మంత్రినికాని, సభాపతినికాని, ఉపసభాపతిని కాని, ప్రభుత్వ చీఫ్ విప్ నుగాని, ప్రభుత్వ విప్ ను కాని కమిటీ సభ్యునిగా నామనిర్దేశం చేయరాదు. కమిటీకి నామనిర్దేశం చేయబడిన తరువాత సభ్యుడెవరైనా మంత్రిగా లేదా ప్రభుత్వ చీఫ్ విప్ లేదా ప్రభుత్వవిప్ గా నియమితులైన లేక సభాపతిగా కాని, ఉప సభాపతిగా కాని ఎన్నికైన అట్టి నియామకపు లేదా ఎన్నికైన తేదీనాటి నుండి ఆ సభ్యుడు కమిటీ సభ్యత్వమును కోల్పోవును.

ఏడుగురు సభ్యులకు మించకుండా, పై 1వ నిబంధనకు లోబడి సభాపతి ఈ కమిటీని నియమిస్తారు.

(ii) సభాపతిపైన మినహా, మంత్రితో సహా ఏ సభ్యుని పైనైనా సభ వెలుపలి వారి అనైతిక ప్రవర్తనకు సంబంధించి ఏ వ్యక్తి అయినా అర్జీ రూపంలో రాతపూర్వకంగా సభాపతికి ఫిర్యాదు చేయవచ్చు. సభ్యుని అనైతిక ప్రవర్తనకు సంబంధించిన ఫిర్యాదులను సభ కూడా ఒక ప్రతిపాదన ద్వారా కమిటీ పరిశీలనకు పంపవచ్చు. సభ్యుని అనైతిక ప్రవర్తనకు సంబంధించిన అంశాలపై కమిటీ తనంతతానుగా కూడా విచారణ చేపట్టవచ్చు.

(iii) ఏ వాస్తవాల ఆధారంగా ఫిర్యాదు చేయబడిందో వాటికి సంబంధించిన సంక్షిప్త వివరణ ప్రతి ఫిర్యాదులోను వుండాలి. సాక్ష్యాధార పత్రాలపై ఆధారపడి ఫిర్యాదు చేయబడినట్లయితే ఆ పత్రాలను కూడా ఫిర్యాదుతో జతచేసిన ప్రతి పత్రం పైన ఫిర్యాదుదారుడు సంతకం చేయాలి. వాదనల ధ్రువీకరణకోసం, సివిల్ ప్రొసీజర్ కోడ్ (1908) సం.పు (5)లో నిర్దేశించిన పద్ధతిలోనే దానిని ధృవీకరించాలి.

(iv) నియమాలలోని ఆవశ్యకతల కనుగుణంగా ఫిర్యాదు వున్నట్లయితే సభాపతి విచారణ నిమిత్తం దానిని కమిటీకి నివేదిస్తారు.

(v) పరిశీలన నిమిత్తం ఫిర్యాదు అందిన పిమ్మట ఫిర్యాదులోని విషయంపై ముందుకు సాగడానికి వీలుగా ప్రాథమిక సాక్ష్యాధారాలేవైనా ఉన్నాయా అనే విషయాన్ని ధృవీకరించుకోవడం కోసం కమిటీ ప్రాథమిక పరిశీలన జరుపుతుంది. క్రమ విచారణ జరపడానికి తగినన్ని కారణాలు న్నాయని ప్రాథమిక పరిశీలన అనంతరం కమిటీ నిర్ణయానికి వచ్చినట్లయితే, ఏ సభ్యునిపైన ఫిర్యాదు చేయబడిందో ఆ సభ్యునికి తన వివరణను తెలియపరచుకునే అవకాశం ఇచ్చేందుకుగాను ఫిర్యాదు నకలును, దానికి జతచేయబడి ఏవైనా పత్రాలు ఉన్నట్లయితే వాటి నకళ్లను ఆ సభ్యునికి అందచేస్తారు. ప్రతి ప్రాథమిక విచారణను,

తదుపరి జరిపే విచారణను ఫిర్యాదుదారుడు ఫిర్యాదు చేయబడిన సభ్యుని గుర్తింపును బయట పెట్టకుండా గోప్యంగా నిర్వహించాలి. విచారణను పూర్తి చేయలేక పోవడానికి తగినన్ని కారణాలు లేక పోయినట్లయితే తప్ప, ప్రతి విచారణను మూడు నెలలలోగా పూర్తి చేయాలి. నియమాలలో అన్యథా పేర్కొన్న సందర్భాలలో తప్ప, సభా హక్కుల ఉల్లంఘన విషయంలో విచారణకు నిర్ధారణకు ఏ కార్యవిధానాన్ని అనుసరిస్తారో అదే కార్య విధానాన్ని కూడా కమిటీ సూచించవలెను.

(vi) ఫిర్యాదు ఆషామాషీగా వున్నా లేదా విసుగు కలిగించే విధంగా వున్నా, లేదా సదుద్దేశ్యంతో చేసినది కాకపోయినా దానిపై విచారణ తిరస్కరించే విచక్షణాధికారం కమిటీకి వుంది. విచారణ విషయంలో ముందుకు సాగడానికి తగినన్ని కారణాలు లేకపోయి నట్లయితే కూడా కమిటీ విచారణను నిలిపి వేయవచ్చు. విచారణను తిరస్కరించడానికి, విచారణను నిలిపివేయడానికి గల కారణాలను కమిటీ నమోదు చేసి, వాటిని ఫిర్యాదుదారునికి, సభ్యునికి తెలియపరచాలి.

(vii) తప్పుడు లేదా ఆషామాషీ లేదా విసుగు కలిగించే ఫిర్యాదులను చేసినవారు, సభ విధించే శిక్షకు పాత్రులవుతారు. సభకు నివేదికను సమర్పించే వరకూ ఎవ్వరూ కూడా ఫిర్యాదులోని అంశాలను బహిరంగ పరచకూడదు. నివేదికను సమర్పించక మునుపు, ఎవ్వరైనా ఫిర్యాదులోని అంశాలను బహిరంగ పరిచినట్లయితే శిక్షకు పాత్రులవుతారు.



# 23

## ఆంధ్రప్రదేశ్
## శాసన సభ కార్య విధానం
## సంపుటి

## నైతిక విలువల కమిటీ




ఆంధ్రప్రదేశ్ శాసన మండలి
సచివాలయం, వెలగపూడి, అమరావతి.